

# అమెరి "కలగూరగంప" కామెడి
## వంగూరి చిట్టెన్‌రాజు



## తంటా సంఘాల మహా సభలూ- కొత్త తంటాలూ

17

**ఈ ఏడు జూన్ నెలాఖరునుండి జూలై మొదటి** వారాంతం దాకా అమెరికాలో ఉన్న రెండు తంటా సంఘాలు ఒకే రకం మహా సభలు జరుపుకుంటున్నాయి. ఏవో అతిథుల పేర్లు, ఆర్గనైజర్ల పేర్లు మారతాయి తప్ప తతంగం అంతా ఒకటే. ఏమాట కామాటే చెప్పుకోవాలంటే, వచ్చే ఏటితో పోల్చి చూస్తే ఈ ఏడు కొంచెం నయమే. ఎందుకంటే ఈ ఏటి సభలు వేరే, వేరే ఊళ్ళలో, వేరే వేరే తేదీలలో జరుగుతున్నాయి. ఈ రెండు మహా సభల కండువా రంగులు మటుకు సరిగ్గా తెలియడం లేదు. అంచేత నా బోటి "రెండిటికీ చెందని రేవడు" గాళ్ళు హ్యూస్టన్‌లో ముందు జరుగుతున్న సభలు చూసుకుని, వాటిల్లో వాళ్ళేమన్నా ఏ నాటకం అన్నా వెయ్యనిస్తే వేసేసి, అవకాశం ఇస్తే సాహిత్య సభలో అందరికీ సుత్తి కొట్టేసి, "అవధానంలో నన్ను నోరు విప్పనిస్తే" అప్రస్తుత ప్రసంగం చేసేసి, పెట్టే, బేడా సద్దుకుని మూడు రోజుల తరవాత అట్లాంటాలో జరగబోయే మరొక మహాసభలకి, కావాలంటే కండువా మార్చేసి, బహుశా "చూచుటకు" మాత్రం వెళ్ళగలను.

ఇక్కడ గమనించవలసిన మొదటి విషయం ఏమిటంటే.."అవధానంలో నన్ను నోరు విప్పనిస్తే ...." అనే వాక్యం కావాలనే ప్రవచించాను. దానికి కారణం ఏమిటంటే మా అవధాన నిర్వాహకులు నేను అప్రస్తుత్త ప్రసంగిని అని తెలిస్తే అటు అవధానులు, మరియు ప్రేక్షకులు కట్టకట్టుకుని ధర్నా చేస్తారేమో అని అనుమానంతో ఎందుకైనా మంచిదని ఇది జంట కవుల అవధానం కాబట్టి ఇద్దరు అప్రస్తుత ప్రసంగీకులు ఉండాలి అని నటరత్న వారసుడు బాలకృష్ణని కూడా నాతో పాటు జంటగా నియమించారు. ఇది వరలో ఒకానొక త్రిగుణిత అవధానంలో నేనూ, మిత్రుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జాయింట్‌గా ఆ పాత్ర పోషించాం లెండి. అప్పుడు మా కాంబినేషన్ విజయవంతం అవడం కూడా ఈ ఆలోచనకి ఒక ప్రేరణ అయి ఉంటుంది. ఇప్పుడు సదరు బాలయ్యని నేను ఎప్పుడూ వ్యక్తిగతంగా చూడలేదు కానీ అప్పుడప్పుడు సినిమాలలోనూ, టీవీలోనూ చూశాను. ఆయన నోరు విప్పడం మొదలుపెడితే అరగంట దాకా ఆపడం నేను ఎప్పుడూ చూడలేదు. అంతియునే కాదు, ఆ అరగంటలోనూ ఆయన దేని గురించి ఎందుకు మాట్లాడారో కూడా నాకు ఎప్పుడూ అర్థం అవలేదు. అంతా అప్రస్తుతమే! ఇందుకు మినహాయింపు మొన్నటి శ్రీరామరాజ్యం సినిమా. ఎందుకంటే బాపుగారూ, రమణగారూ ఆ సినిమాలో శ్రీరాముడు పాత్రని అతి తక్కువ డైలాగులతో...అదైనా సినిమా మొదటి భాగంలో మాత్రమే కొన్ని చిన్న డైలాగులు పెట్టి ఎంతో చాకచక్యంతో బాలకృష్ణని కట్టడి చేశారు. లేకపోతే ఆ మానవుడు చెరిగేసును. అందుకే మేం ఇద్దరం కలిసి అప్రస్తుత ప్రసంగం చేస్తే నా పని గోవిందా, గోవింద. ఆ మాటకొస్తే జంట అవధానులకి కూడా నోరు మెదిపే సమయం దొరుకుతుందా

అనే అనుమానాన్ని నేను నిర్వాహకులతో అనగానే "కాదు సార్, మీరూ, బాలకృష్ణ ఉంటే, మనకి క్లాసూ, మాసూ కూడా ఉంటాయి" అని నా నోరు మూయించాడు. నేను కూడా రెచ్చిపోకుండా నోరు మూసుకోడానికి కారణం, మా ఇద్దరిలో ఎవరు క్లాసూ, ఎవరు మాసూ అని తెలియకా, ఒక వేళ వారి అభిప్రాయం అడిగి తెలుసుకుంటే కలిగే నా మానసిక వత్తిడికి తట్టుకోలేనేమో అని భయపడ్డాను.

ఇక గమనించవలసిన రెండో విషయం ఏమిటంటే "ఆ రెండో సభలకి బహుశా చూచుటకు మాత్రం" వెళ్ళగలను అనే నా అభిప్రాయం వెనకాల చిన్న సైజు తతంగం ఉంది. అదేమిటంటే, మా హ్యూస్టన్ లో జరుగుతున్న మహా సభలకి ఒకానొక పెద్దాయన్ని ఆహ్వానిద్దామని ఫోన్ చేశాను. ఆ సంభాషణ సారాంశం ఇదీ!

"అయ్యా, పెద్దాయనా, నేనూ ఫలానా.... జ్ఞాపకం ఉన్నానా? మీరు కిందటిసారి వచ్చినప్పుడు మీ మనవడికి మేడిన్ తైవాన్ వారి అమెరికా చెడ్డీలు అరడజను కొనిపెట్టాను. ఇప్పుడు మా హ్యూస్టన్ మహాసభలకి మీరు తప్పకుండా రావాలి. టికెట్ ఇస్తాం, ఇక్కడ ఖర్చులన్నీ పెట్టుకుంటాం, మీ మనవడికి లేటెస్ట్ మోడెల్ చెడ్డీలు ఎక్కడ దొరుకుతాయో గూగుల్ చేసి కనుక్కోమని చెప్పండి, సైజు పెరిగి ఉంటుందిగా, అందుకూ".

"ఓ మీరా, మా మనవడు ఇప్పుడు డల్లాస్‌లో ఉన్నాడు. ఐటీ ఉద్యోగం. సైజు నాకు తెలీదు. అయినా నన్ను గుర్తుపెట్టుకుని పిల్చినందుకు థేంక్స్. మామూలుగా అయితే నో ప్రోబ్లెం కానీ, సారీ సార్...మీరు లేటుగా పిల్చారు. అవతలి వాళ్ళు మొన్ననే పిల్చి నన్ను బుక్ చేసుకున్నారు"

"అవతలి వాళ్ళా, ఎవరూ?"

"అదే సార్, అట్లాంటా వాళ్ళు"

"ఓ అదా, దానికేం, వాళ్ళ మహాసభలు మా తరవాత కదా! ప్రోబ్లెం ఏమిటీ? ముందు హ్యూస్టన్ వచ్చి, ఇక్కడి నుంచి మనం ఇద్దరం అక్కడకి వెళ్దాం"

"ఏమిటి సారు, ఏమీ తెలియనట్టు అంటారూ. మీ మహా సభలకి వచ్చిన వాళ్ళు ఆ సభలకి ఎలా వెళ్ళగలరూ? అలాగే, అక్కడకి వెళ్ళే వాళ్ళు మీ దగ్గరకి హౌ కెన్ దె కమ్మూ?"

"దానికేముంది మహాశయా, సగం టిక్కెట్టు వాళ్ళూ, సగం మేమూ పెట్టుకుంటాం. పైగా మీకు ఒకే తద్దినానికి రెండు తాంబూలాలు దక్కుతాయి కదా" అనేసి అర్జంటుగా నాలిక్కొరిచేసుకున్నాను. ఇటువంటి క్లిష్టమైన పరిస్తితులలో పవిత్రమైన తద్దినం ప్రసక్తే కదా అసలైన అప్రస్తుత ప్రసంగం అంటేనూ.

"సర్లెండి, అక్కడ మీరూ, మీరూ కొట్టుకుని ఒక్కోటీ రెండేసి సంఘాలుగా విడిపోయి, మధ్యలో పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటూ ఉంటే, మాకు బలేగా ఉంది మేష్టారూ. అమెరికాలో ఎన్ని సంఘాలు విడిపోయి కొత్త సంఘాలు పుట్టుకొస్తే మాకు అన్ని ఇన్విటేషన్లు.....సారీ తద్దినాలూ..." భగ్గుమని మండిపడుతూ ఆనందపడ్డాడు ఆ పెద్దాయన.

ఆ మంటలో అప్పుడు నాకు వెలిగింది అసలు సంగతి. గతంలో ఒకే సంఘంగా ఉన్న ఈ రెండు మహాసభల నిర్వాహక సంఘాలూ పైకి బాహాటంగా చెప్పకపోయినా, వాళ్ళో, మేమో తేల్చుకోండి, ముందు మా మహా సభలకి వచ్చిన తరవాత మిగిలిన చోట్లకి కావలిస్తే ఊరేగండి అని లోపాయికారీగా ఇండియా అతిథులకి రెండు సంఘాల వారూ సూచనలు ఇస్తున్నారేమో అని ఈ పెద్దాయన మాటలతో నాకు అనుమానం వచ్చేసింది. సరిగ్గా అదే లాజిక్ ప్రకారం, నేను మా హ్యూస్టన్ సభలలో ఏదో రకంగా స్టేజ్ ఎక్కితే, నాకు అట్లాంటాలో అటువంటి అవకాశం ఉండదు కాబట్టి, కేవలం చూచుటకూ, వరండాలలో తిరగడానికి మాత్రమే కదా అక్కడికి వెళ్ళాలి!

అప్పుడు నాకు ఒక బ్రిలియంట్ ఆలోచన వచ్చింది. తంటా సంఘం నెంబర్ వన్ వాళ్ళు ప్రయాణం టికెట్ కొని పెడితే, తంటా సంఘం నెంబర్ టూ వాళ్ళ ప్రోగ్రాంకి కూడా వెళ్ళడం కరెక్టు కాదు కదా! అలాంటప్పుడు రెండు సంఘాలూ కలిసి ఖర్చులు పంచుకుని

గొప్ప వాళ్ళని రెండు చోట్లకీ పిలవచ్చుగా అని అనిపించింది. ఈ మాటే అనగానే "నువ్వో వెర్రి వాడివి. ఎందుకైనా మంచిది ఈ ఏటికి నీ పేరు రెడ్డి శాస్త్రిగా మార్చేసుకో, అన్నింటికీ పనికొస్తుంది. అక్కడా, ఇక్కడా దూరిపోవచ్చు. గుడ్ నైట్" అని టెంకి జెల్ల కొట్టేసి వర్క్‌కి పారిఫొయింది మా క్వీన్ విక్టోరియా.

ఈ ఏడే ఇలా ఉంటే ఇక వచ్చే ఏడు ఎలా ఉంటుందో అని నాకు అర్జంటుగా మరొక అనుమానం వచ్చేసింది. ఎందుకంటే, వచ్చే ఏడు మరో రెండు తంటా సంఘాలు ఒకే ఊళ్ళో, ఒకే రోజులలో ఒకే పరిసరాల్లో మహాసభలు జరుపుకుంటున్నాయి. కానీ, కండువా కన్ఫ్యూజన్ లేకుండా అందరూ బహుశా ఒకే ఒక ఏ పసుపు రంగు కండువాయో వేసుకుంటారేమో అని నా అనుమానం. అంటే నా బోటి వాడు ఏదో ఒక మహాసభకే వెళ్ళగలడన మాట. అతి తెలివి తేటలకి పోయి, ఒక మహాసభలో మధ్యాహ్నం భోజనం చేసేసి, రాత్రి సినిమా తారల అంగ విన్యాసాల వీక్షణకి రెండో సభలకీ వెళ్దామనుకుంటే, రెండు చోట్లా రిజిస్ట్రేషన్ డబ్బుకి సింగిల్ తద్దినం సంభావన కన్నా ఎక్కువ ఖర్చు అయిపోతుంది. అంచేత, చచ్చినట్టు వాళ్ళో, వీళ్ళో ముందే తేల్చుకోవాలి. అలా తేల్చుకోవాలంటే, ఏ సభకి గోవా నుంచి దిగుమతి అయిన హీరోయిన్‌లు వస్తున్నారూ, దేనికి బొంబాయి అగర్వాల్ అమ్మాయిలు దిగుతున్నారూ మొదలైన కీలక అంశాలు ఉంటాయి. అందు చేత వచ్చే ఏటి సభా నిర్వాహకులకి నా సలహా ఏమిటంటే....మీరు ఇండియా అతిథుల ఆహ్వానం ప్రోజెక్ట్‌ని ఈ ఏటి మహాసభల నిర్వాహకులకి ఔట్‌సోర్స్ చేసెయ్యండి. ఆఫ్టాల్ వీళ్ళకి ఈ ఏడు అనుభవం వచ్చేసిందిగా! అప్పుడు వీళ్ళు ఏం చెయ్యాలంటే వీసా ఉన్న ఫ్రీక్వెంట్ ఫ్లైయర్స్ కేటగిరీ వారినీ, వీసా లేని ఫేమస్ వాళ్ళనీ, రాజకీయ నాయకులనీ, రెండు సభలకీ కేటాయించాలి. ఇలాంటి వాటిల్లో ఎవరు, ఏ సభకి వెళ్ళినా కొంప మునిగిపోదు కానీ గోవా మరియు ముంబై సినిమా తారలని మటుకు వేలం వెయ్యాలి. అంటే ఏ సంఘం వారు, ఏ తారకి ఎంత ధర పలుకుతారూ అనే నా తాత్పర్యం కానీ, వేలం అనే మాటకి నన్ను అపార్థం చేసుకోకండి. ఈ ఐడియా కూడా చెప్పగానే..." సర్లే..వచ్చే ఏటికి నీ పేరు చౌదరీ శర్మ"గా మార్చేసుకో, కమ్మ కరణాల శాఖ అనుకుని అక్కడికీ, ఇక్కడికీ రానిస్తారు, గుడ్ డే" అని టెంకి జెల్ల కొట్టేసి బెడ్‌రూంలోకి పారిపోయింది అప్పుడే వర్క్ నుంచి వచ్చిన మా క్వీన్ విక్టోరియా.

●●●

Post your comments